క్లుప్తంగా

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

కేశంపేట: ప్రజలు గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ వివిధ అస్పత్రుల సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ పాల్గొని ప్రారంభించారు. గ్రామానికి చెందిన సుమారు 357 మందిని వైద్యులు పరీక్షించి, అవసరమైన రోగులకు టీకాలతో పాటు మందులను అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు, నాయకులు మురళీధర్‌రెడ్డి, యారం శేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి, జమాల్‌ఖాన్, మల్లేశ్‌యాదవ్, భూపాల్‌రెడ్డి, మురళీ, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో 61 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.22లక్షల చెక్కులను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభు త్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ఆలోచనతో ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతారాయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

కేశంపేట: అయోధ్యలోని రామ మందిరంలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో అర్చకులు, గ్రామస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు సహస్త్ర పుష్పార్చన చేశారు. అనంతరం గ్రామానికి చెందిన శోభారాణి రవీందర్ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మఠం చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి, యాదయ్యచారి, శేఖర్, చంద్రశేఖర్, యుగందర్, మురళీ, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, నర్సింహ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

షాబాద్: మండల పరిధిలోని చర్లగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటేశ్‌గౌడ్ కుమారుడు వినోద్‌గౌడ్(22) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు పామెన నర్సింహులు, మంగలి చెన్నయ్య, మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, సత్తయ్య తదితరులు వినోద్‌గౌడ్ మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను వారు పరామర్శించారు.

దేవాలయానికి కంచు విగ్రహాల బహూకరణ



విగ్రహాలను అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉన్న సీతారామాంజనేయస్వామి దేవాలయానికి బుధవారం గ్రామానికి చెందిన స్వర్గీయ చాపల బాలకృష్ణయ్య, వెంకటమ్మ జ్ఞాపకార్థం వారి కూతురు అలివేలు మంగ, అల్లుడు కృష్ణ రూ.80వేల విలువ చేసే దేవతా మూర్తుల కంచు విగ్రహాలను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, గ్రామస్తులు పాల్గొన్నారు.

పథకాల అమలు నిరంతర ప్రక్రియ

ఎవరూ ఆందోళన చెందొద్దు

- గ్రామసభలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి
- అర్హుల జాబితాను వెల్లడించిన అధికారులు
- నూతన దరఖాస్తుల స్వీకరణ



ఎల్గొండగూడ గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, ఆర్డీఓ చంద్రకళ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ, రేగడిదోస్వాడ, హైతాబాద్, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా పథకాలకు అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన ఉంటుందన్నారు. ఆస్పల్లిగూడ నుంచి మీరాపూర్ వరకు బీటీ రోడ్డు మంజూరైందని చెప్పారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. అర్హుల జాబితాలో పేర్లు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు. చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబితాలో ప్రజాభిప్రాయాలు, సూచనలు తీసుకుంటామన్నారు. అనర్హులుంటే అభ్యంతరం చెప్పాలని, జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. అనంతరం అధికారులు అర్హుల జాబితాను వెల్లడించారు. కార్యక్రమంలో గుడిమ్మాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఏఓ వెంకటేశం, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఖాజామీయా, ఆంజనేయులు, నాయకులు తదితరులు ఉన్నారు.

కేశంపేట మండలంలో..

కేశంపేట: మండల పరిధిలోని ఇప్పలపల్లి, కొండారెడ్డిపల్లి, లింగంధన, బోధునంపల్లి, చింతకుంటపల్లి, మంగళిగూడ, పాల్కొనిగుట్టతండా, పుట్టోనిగూడ, సంతాపూర్, తొమ్మిదిరేకుల, తూర్పుగడ్డతండా, కొనాయపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారుల సమక్షంలో బుధవారం గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు అర్హుల జాబితాను ప్రకటించారు. అర్హుల జాబితాలో పేర్లు లేనివారు అధికారులకు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు.

సర్వే వివరాల ఆధారంగా..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్, చిన్నమంగళారం, అప్పారెడ్డిగూడ, నక్కలపల్లి, తోల్‌కట్ట, కనకమామిడి గ్రామాల్లో అధికారులు గ్రామసభలను నిర్వహించి అర్హుల జాబితాను చదివి వినిపించారు. జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందొద్దని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ, కార్యదర్శి సంధ్యారాణి, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: కాశీంబౌలి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల: అంతారం గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

అర్హులందరికీ సంక్షేమం పథకాలు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాశీంబౌలి, బాకారం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అర్హులను గుర్తించేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాగు యోగ్యం కాని భూముల జాబితా గ్రామసభలో ప్రదర్శిస్తారని, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. గ్రామసభల్లో రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వాటన్నింటి అర్హుల జాబితాలో పేర్లను అధికారుల సమక్షంలో వెల్లడించారు. జాబితాలో అర్హులైన వారు పేర్లు రాకపోతే మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని, అధికారులు పరిశీలించి ప్రభుత్వం ద్వారా అమలు చేసేందుకు కృషి చేస్తారన్నారు. సమావేశంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రరెడ్డి, పశువైద్యాధికారి దేవిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవితారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ కల్పన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చెందొద్దు

శంకర్‌పల్లి: నిజమైన అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ అశోక్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రామంతాపూర్‌లో నిర్వహించిన వార్డుసభలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు జాగ్రత్తగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేశ్, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించేందుకే గ్రామసభలు

చేవెళ్ల: మండలంలో బుధవారం ఊరేళ్ల, అంతారం, కేసారం, రావులపల్లి, దామరగిద్ద, ఎన్కేపల్లి, కందవాడ, పలుగుట్ట, తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని అంతారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆర్డీఓ చంద్రకళ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి అందిస్తాం



కొత్తూరు: ఇన్ముల్‌నర్వలో జాబితాను వెల్లడిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో బుధవారం ఎంపీడీఓ బన్సీలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిరుపేదల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి గ్రామస్తుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా గ్రామంలో జీపీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీ రాజారత్నం, తహసీల్దార్ పార్థసారధి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహ్మద్‌అలీఖాన్ బాబర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామసభలు

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ, మక్తగూడ గ్రామాల్లో సభలు నిర్వహించారు. అధికారులు సభల్లోనే అర్హుల పేర్లు ప్రకటించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఏఓ గోపాల్, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మొయినాబాద్ మండలంలో..

మొయినాబాద్: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అప్పోజీగూడ, సురంగల్, మోత్కుపల్లి గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుదేలైన ఆర్టీసీకి ప్రభుత్వ జీవం

- ప్రతీ పల్లెకు సేవలను విస్తరింపజేస్తాం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో జీవన్మరణ సమస్యతో కుదేలైన ఆర్టీసీ సంస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం జీవం పోసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం ఉష ఆధ్వర్యంలో మేకగూడకు బస్సు, బైపాస్ మీదుగా వెళ్తున్న నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి తదితర డిపోల బస్సులు షాద్‌నగర్ పట్టణం మీదుగా వెళ్లే సర్వీసులను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ ఉద్యోగులు ప్రధాన భూమిక పోషించారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత పదేళ్ల పాలనలో రవాణా వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తం చేసిందని ఆరోపించారు. ఆనాడు బతిమిలాడితే బస్సెక్కనోళ్లు ఈ రోజు బలవంతంగా బస్సు ఎక్కుతున్నారన్నారు. ఇతర డిపోల బస్సులు పట్టణంలోనికి రాకపోవడంతో ప్రతిరోజు హైద్రాబాద్, మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. వారి కష్టాలను దృష్టిలో పెట్టుకొని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి ఇతర డిపోల బస్సులు పట్టణంలో నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నామని, దీంతో ప్రయాణికుల కల నెరవేరిందన్నారు. త్వరలోనే షాద్‌నగర్ డిపోకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తీసుకొచ్చి డిపోను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. షాద్‌నగర్ డిపోను మహబూబ్‌నగర్ రీజియన్ నుంచి రంగారెడ్డిలో కలపాలని ఆర్టీసీ ఉద్యోగుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే రాష్ట్ర మంత్రి, ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు ఎమ్మెల్యే, డీఎంను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, నాయకులు, ఆర్టీసీ సీఐ సుధాకర్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హామీల అమలుకు ప్రత్యేక చర్యలు

ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉద్యమకారుల సంక్షేమ సంఘం షాద్‌నగర్ తాలుకా చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న యమ్మి హోటల్‌లో ఉద్యమకారుల సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, ప్రతి కుటుంబానికి రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం వంటి హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా నిజమైన ఉద్యమకారులను గుర్తించి, వారి వివరాలను సేకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకుగాను మండల, పట్టణ కమిటీలను ఈ నెల 26, 27 తేదీల్లో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పినబాక ప్రభాకర్, వెంకటేశ్, జాంగారి నర్సింహ, సిరాజుద్దీన్, యాదయ్య, జాంగారి రవి, శ్రీనాథ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, స్టేషనరీ

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం కుందేలుకుంటతండా పరిధిలోని పోతురాజుగడ్డతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం శంకర్‌పల్లి మండలం మోకిల తండాకు చెందిన లింబ్యానాయక్ స్పోర్ట్స్ డ్రెస్, షూస్, ఐడీ కార్డు, టై, బెల్టు, స్టేషనరీ అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాత లింబ్యానాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని హెచ్‌ఎం కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, రాములు, అంగన్‌వాడీ టీచర్ కవిత, గ్రామపెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: అందరికీ ఆమోద యోగ్యమైన, అభివృద్ధి కాంక్షించే మున్సిపాలిటీగా చేవెళ్లను ఏర్పాటు చేయాలి కానీ రాజకీయ లబ్ధికోసం స్వరూపం లేని మున్సిపాలిటీ ఏర్పాటు సరైందికాదని బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల మండల కేంద్రానికి సరిహద్దులుగా ఉన్న కందవాడ, పలుగుట్ట, పామెన, మల్లారెడ్డిగూడ గ్రామాలను వదిలేసి దూరంగా ఉన్న ఊరేళ్ల, రామన్నగూడ గ్రామాలను కలపటంపై ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. చేవెళ్ల పార్లమెంట్, అసెంబ్లీ కేంద్రం కాబట్టి అభివృద్ధి చెందే పెద్ద మున్సిపాలిటీగా ఉండాలని బీజేపీ కోరుకుంటుందన్నారు. గతంలో చేవెళ్ల మున్సిపాలిటీని 12 గ్రామాలతో ఏర్పాటు చేస్తున్నట్లుగా అధికారులు నివేదికలు పంపినట్లుగా చెప్పారు. కాని ఇప్పుడు కేవలం 8 గ్రామాలతోనే మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. చేవెళ్లలో బీజేపీ బలోపేతం అవుతుండడంతో.. కొంత మంది రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం ఇలా చేయడం సరికాదన్నారు. భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని చేయాలని, ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ పెద్దలు ఆలోచన చేసి చేవెళ్ల మున్సిపాలిటీని 12 గ్రామాలతో కలిపి పెద్ద మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



విద్యార్థులతో దాత, నాయకులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందించే సహాయం మరువలేనిదని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత సామ రంగారెడ్డి స్పోర్ట్స్ డ్రెస్, షూ, టై, బెల్టు, ఐడీకార్డులను బుధవారం అందజేశారు. వీటిని పాఠశాలలో పాఠశాల అభివృద్ధికి కమిటీ సమక్షంలో ఉపాధ్యాయులతో కలిసి దాత విద్యార్థులకు అందజేశారు. అనంతరం దాతను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామ మానిక్యరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కమ్మదనం గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు, గ్రామస్తులను కమ్మదనం గురుకుల ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు కలిశారు. గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతి, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి, గౌలిదొడ్డి, అలుగునూరు సీఓఈలో 9వ తరగతి, ఖమ్మం, పరిగి ఎస్ఓఈలో 8వ తరగతి రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజిగిరి ఫైన్ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఫిబ్రవరి 1వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23 తేదీన నిర్వహిస్తారని తెలిపారు. గురుకులాల ప్రవేశ పరీక్షకు కులం, ఆదాయ, ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎలికట్ట పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, సక్కుబాయి, కృష్ణమ్మ, అరుణ, రేణుక, మాలతి, స్వప్న, ప్రవీణ్‌కుమార్, కమ్మదనం ఉపాధ్యాయులు అనసూయ, శ్రీదేవి, స్వాతి, అంగన్‌వాడీ టీచర్ శారదమ్మ, గ్రామస్తులు జంగయ్య, దర్శన్, నర్సింలు పాల్గొన్నారు.



గురుకుల ప్రవేశ పరీక్ష కరపత్రాలను చూపుతున్న ఉపాధ్యాయులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

- కొండాపూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సునీతారెడ్డి

శంకర్‌పల్లి: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాల్సిందేనని కొండాపూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) సునీతారెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం శంకర్‌పల్లి పట్టణంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ చౌరస్తాలో మానవహారంగా నిల్చొని, ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపొద్దని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, ట్రైనీ ఎస్ఐ చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ అరుంధతి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యాశాఖ, పోలీసు, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల నుంచి ముఖ్య కూడలి వరకు విద్యార్థులు నాయకులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఎంవీఐ వాసు, ఎంఈఓ మనోహర్, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

షాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలోని ముంబాయి–బెంగళూరు లింకు జాతీయ రహదారిపై రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో మానవహారం, ర్యాలీ నిర్వహించి, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవింద్‌నాయక్, బాలికల పాఠశాల హెచ్‌ఎం యామినీ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రూల్స్ పాటించాలి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో బాగంగా మండల విద్యాధికారి పురందాస్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వివేకానంద, శ్రీసాయి చైతన్యకు చెందిన పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం మెహర్ ఉనీసా బేగం, ట్రాఫిక్ ఏఎస్ఐ చందర్‌నాయక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సునీతారెడ్డి

ప్రమాదాలను అరికడదాం

కొత్తూరు: ట్రాఫిక్ నిబంధనలు పాటించి.. ప్రమాదాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కొత్తూరు సీఐ నర్సింహారావు అన్నారు. పట్టణంలో బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆయన పలువురు నాయకులు, విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రత ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ బాలాజీ, ఎంఈఓ అంగూర్‌నాయక్, నాయకులు దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడొద్దని విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, వీరారెడ్డి, గోవర్ధన్, శంకర్, రామకృష్ణ, కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ భూపాల్‌శ్రీధర్, ఎంఈఓ పురన్‌దాస్



కొత్తూరు: విద్యార్థులు, నాయకులతో కలిసి ర్యాలీ